క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



అన్నా క్యాంటీన్‌లో ఆహారాన్ని రుచి చూస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం: అన్నా క్యాంటీన్లలో ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ నిర్వాహకులకు సూచించారు. పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో ఆహారాన్ని రుచి చూశారు. అనంతరం రెండో డివిజన్ శానిటేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించి ప్రతి వార్డుల్లో పారిశుద్ధ్య పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



అలంకరణలో జానకి, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి మూలవిరాట్లు

ధర్మవరం అర్బన్: తారకరామాపురంలోని జానకీరామాలయంలో శుక్రవారం స్వామివార్ల విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలూరు రాజశేఖర్‌శాస్త్రి ఆధ్వర్యంలో మహాగణపతి, వేణుగోపాల స్వామి, జానకి, రామ, లక్ష్మణ, అంజనేయ స్వామి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అనంతరం వందలాది మంది భక్తులకు అన్నదానం చేపట్టారు. బీజేపీ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు.

సమయం వృథా చేయొద్దు



మాట్లాడుతున్న జిల్లా అధికారి శివరంగ ప్రసాద్

కదిరి అర్బన్: రాబోవు 40 రోజులు చాలా ముఖ్యమైనవని, సమయం వృథా చేయకుండా బాగా చదువుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ,సాధికారత అధికారి శివరంగప్రసాద్ టెన్త్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో కదిరి డివిజన్ పరిధిలో ఎస్సీహాస్టళ్లలో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికా బద్ధంగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. పరీక్షల భయాన్ని పోగొట్టడమే ఈ ప్రేరణ, శిక్షణా తరగతుల ఉద్దేశమన్నారు. టెన్త్‌లో గతేడాది జిల్లా వ్యాప్తంగా ఎస్సీ హాస్టళ్లలో 91 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ ఏడాది 100 శాతం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ రెడ్డి బాలాజీ, ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకటాచలం , హాస్టల్ వార్డెన్లు రవీంద్రనాథ్‌రెడ్డి, వేణుగోపాల్, ప్రసన్న కుమారి, ఫామీదా, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్, సిడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. మూడు కంపెనీల ప్రతినిధులు 112 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 52 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్, సిడాప్ డీపీటీఎం నారాయణ స్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

‘డివార్మింగ్’ను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ పుష్ప

ధర్మవరం రూరల్: డివార్మింగ్(నులి పురుగుల నివారణ) కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని దర్శనమల పీహెచ్‌సీ వైద్యాధికారిణి పుష్ప పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో డివార్మింగ్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఈ నెల 10న అంగన్‌వాడీ పిల్లలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కోరారు. ఎంపీడీఓ సాయి మనోహర్, ఎంఈఓ గోపాల్‌నాయక్, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ఆశలకు కత్తెర!

- మొక్కజొన్న పంటను ఆశించిన కత్తెర పురుగు
- పంట దిగుబడిపై ప్రభావం
- ఆందోళనలో రైతులు



కత్తెర పురుగు ఆశించిన మొక్కజొన్న



నల్లచెరువులో సాగుచేసిన మొక్కజొన్న

నల్లచెరువు: కత్తెర పురుగు మొక్కజొన్న రైతుల ఆశలను అడియాశలు చేస్తోంది. పంట తొలినాళ్లలోనే పురుగు ఆశించడంతో దిగుబడిపై ప్రభావం చూపుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే పురుగును తొలిదశలోనే గుర్తించి నియంత్రించకపోతే ఇబ్బందులు తప్పవని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. రబీ సీజన్‌లో కదిరి నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 1200 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట 20 రోజుల నుంచి 40 రోజుల దశలో ఉంది. ఇంత వరకూ సాగు చేసిన పంటలో 20 శాతం పంటకు కత్తెర పురుగు ఆశించింది. పంటను ఆశించి మొక్కజొన్న ఆకులను తినేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మొక్కజొన్న ఒక క్వింటాల్ రూ.2200 నుంచి రూ.2500 దాకా పలుకుతోంది.

పెరిగిన పెట్టుబడులు

ఈ ఏడాది మొక్కజొన్న సాగుకు పెట్టుబడులు పెరిగిపోయాయి. సాధారణంగా ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల దాకా ఖర్చవుతుంది. అయితే ఈఏడాది పంట ప్రారంభం నుంచే కత్తెర పురుగు ఆశించడంతో రైతులు మందుల పిచికారీ చేస్తున్నారు. ఒక్కో రైతు రెండు మూడు సార్లు మందులు పిచికారీ చేస్తున్నారు. దీంతో కేవలం మందులకే ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేలకుపైగా ఖర్చవుతోంది. ఇక ఎకరానికి రూ.10 వేల నుంచి 15 వేల వరకూ కౌలు చెల్లించి పంటను సాగు చేసిన రైతుల పరిస్థితి వర్ణనాతీతం. పురుగు మొక్కజొన్న పంట పది రోజుల దశ నుంచి ఆశిస్తోంది. దీనివల్ల మొక్క బలహీన పడి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. వ్యవసాయాధికారుల పొలాలను సందర్శించి పురుగు నివారణ చర్యలు తెలియజేయాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి పెరిగింది



మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించడంతో పురుగు నివారణకు మూడు, నాలుగు సార్లు మందులు అదనంగా పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో పంట సాగుకు మరో రూ.10 నుండి 15 వేలు వరకూ అదనంగా ఖర్చు అవుతోంది.

–అమర్‌నాథరెడ్డి, నల్లచెరువు

అవగాహన కల్పిస్తున్నాం

కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలపై రైతులకు వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశిందని గమనించిన వెంటనే వేప కషాయంతోపాటూ ఇమామెంక్టిన్ బెన్‌జోయేట్ 1 ఎంఎల్ 1 లీటర్ల నీటిలో కలిపి పంటకు పిచికారీ చేయాలి.

– సత్యనారాయణ ,ఏడీఏ కదిరి

కూటమి ప్రభుత్వానికి రైతుల సమస్యలు పట్టవా?



యోగివేమన ప్రాజెక్టు వద్ద విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ముదిగుబ్బ: రైతుల సమస్యలు కూటమి ప్రభుత్వానికి పట్టవా అని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ విమర్శించారు. శుక్రవారం ఆయన ఆ పార్టీ నాయకులతో కలిసి యోగివేమన జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగి వేమన జలాశయం గేట్లు ఎత్తే విషయంలో కూటమి నాయకుల మధ్య వర్గ పోరు ఎంత ఉందో తెలుస్తోందన్నారు. కుడి కాలువకు సాగు నీరు వదిలే విషయమై రైతులు రెండు రోజులుగా జలాశయం అధికారుల చుట్టూ తిరిగారన్నారు. మంత్రి అనుమతి లేనిదే కాలువకు నీరు ఎలా వదులుతారని బీజేపీ నాయకులు అధికారులపై మండిపడడం ఏమిటని ప్రశ్నించారు. రైతుల నుంచి విమర్శలు ఎక్కడ వస్తాయోనని భయపడ్డ అధికారులు కుడికాలువ తూము గేట్లు ఎత్తారన్నారు. కాలువ పనులు చేస్తుండగానే నీళ్ల వదలడంతో అక్కడక్కడ లీకేజీలు పడి నీరంతా వృథాగా పోతోందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాటమయ్య, సీపీఐ నాయకులు మధు, కదిరప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారులు



క్రీడాకారులతో బాస్కెట్‌బాల్ అసిసోయేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల బాస్కెట్‌బాల్ కోర్టులో శుక్రవారం రాష్ట్రస్థాయి పోటీలకుఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈనెల 4న అనంతపురంలో జరిగిన సెలక్షన్లలో నిఖ్యశ్రీ, యశస్విని, అంజన, అలేఖ్యలు, కార్తీక్‌నాయక్, లక్ష్మీనరసింహాలు ప్రతిభ చూపడంతో నిర్వాహకులు వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. వీరు ఈనెల 8 నుంచి 11 వరకు కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగే 8వ ఆంధ్రప్రదేశ్ యూత్ ఇంటర్ డిస్ట్రిక్స్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్ల తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు. ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్‌లు క్రీడాకారులను అభినందించారు.

కమనీయం...భద్రావతి భావనా రుషీంద్రుల కల్యాణం



భావనా రుషీంద్రులస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌వీధిలోని మార్కండేయస్వామి ఆలయంలో శుక్రవారం భద్రావతి భావనా రుషీంద్రుల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ముందుగా భద్రావతి భావనా రుషీంద్రుల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం వందలాది మందికి అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తుల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ పూజల్లో టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్‌రెడ్డి, బీజేపీ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు, పద్మశాలీయ బహుత్తమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

కదిరి టౌన్: కదిరి మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ మాతృసంస్థకు బదిలీ అయ్యారు. ఈమేరకు శుక్రవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కిరణ్‌కుమార్ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసేవారు. మున్సిపల్ కమిషనర్‌గా ఎవరినీ నియమించలేదు.

చట్టాలపై అవగాహన

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం పుట్టపర్తి మహిళా పోలీ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గోపీనాథ్‌రెడ్డి విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే డయల్ 100, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సైబర్‌క్రైం 1930, ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ 181 లపై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ ప్రశాంత్, ఎస్‌ఐ బాబ్జాన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దరఖాస్తుల స్వీకరణ

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలో కాపు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం కాపు, ఒంటరి, బలిజ, తెలగ కులాల యువతీ యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈమేరకు కమిషనర్ ప్రహల్లాద శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పుట్టపర్తి మున్సిపాలిటీకి 8 యూనిట్లు కేటాయించారని, 21 నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 12లోపు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మావిభాగంలో అందజేయాలని సూచించారు. వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో సంప్రదించాలని కోరారు.

గడువు పొడిగింపు

అమడగూరు/తనకల్లు : ప్రభుత్వం సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువును పొడిగించినట్లు అమడగూరు, తనకల్లు ఎంపీడీఓలు మునెప్ప, రెడ్డెప్ప ఓ ప్రకటనలో తెలియజేశారు. గతంలో 7 వ తేదీ వరకూ మాత్రమే గడువు ఉండేదని, అయితే ప్రభుత్వం తాజాగా ఈ నెల 12 వ తేదీ వరకూ గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కదిరి అర్బన్: కొలేపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బొలేరో వాహనం, ద్విచక్రవాహనం ఢీ కొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలు.. నల్లచెరువు మండలానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి బైక్‌పై కదిరికి బయలుదేరాడు. కొలేపల్లి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీ కొంది. దీంతో ప్రసాద్ కాలు విరిగింది. స్థానికులు బాధితుడిని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అంధకారంలో పేరూరు జగనన్న కాలనీ



పేరూరు జగనన్న కాలనీకి విద్యుత్ సరఫరా ఆపేసిన దృశ్యం

రామగిరి: పది రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో పేరూరు జగనన్న కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇళ్లు లేని నిరుపేదలకు పార్టీ, కులం, మతం, ప్రాంతం చూడకుండా అర్హులందరికీ జగనన్న కాలనీల్లో స్థలం మంజూరు చేసి, ఇళ్లు కూడా మంజూరు చేశారు. పేరూరు సమీపంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేయగా అందులో 110 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. 40 మంది దాకా ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. అయితే గత పది రోజులుగా విద్యుత్ శాఖ అధికారులు జగనన్న కాలనీకి విద్యుత్ సరఫరా చేయకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు. విద్యుత్ సరఫరాపై పలువురు విద్యుత్ సిబ్బందిని సంప్రదించగా.. టీడీపీ నాయకులను కలవాలని చెబుతున్నారు. జగనన్న కాలనీపై పచ్చ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఇవేమి పట్టించుకోని స్థానిక అధికారులు తమ బాధ్యతలను మరచి టీడీపీ నాయకులకు సహకరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి రాజకీయాలకు తావు లేకుండా ఆ కాలనీకి విద్యుత్ సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

‘స్వతంత్ర ప్రతిపత్తికి అనుమతి తీసుకుందాం’



సమావేశంలో చర్చిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలో మాతాశిశు ఆస్పత్రి స్వతంత్ర ప్రతిపత్తికి ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నిర్ణయించారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ 2025–26 నుంచి మాతాశిశు ఆసుపత్రిని స్వతంత్ర ప్రతిపత్తితో నిర్వహించేలా అనుమతులు పొందాలన్నారు. ఆసుపత్రికి మంచి గుర్తింపు వచ్చేలా వైద్యాధికారులు, సిబ్బంది పని చేయాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వైద్యులు నరసింహులు, సోనియా, ఏపీఎంఎస్ ఐడీసీ శ్రీనివాసులునాయుడు, పుల్లయ్య, రాధమ్మ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

కదిరి అర్బన్: కదిరి బ్రాహ్మణపల్లి, కేఎస్ పాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు హార్ట్ టు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రవినాయక్ ఆధ్వర్యంలో దాత అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్ శ్రీనివాస్ పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం ధర్నా



సచివాలయ ముందు ధర్నా చేస్తున్న మహిళలు

కదిరి టౌన్: ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం 6వ వార్డు సచివాలయం ఎదుట మహిళలు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా అమీన్‌నగర్ అభివృద్ధి కమిటీ కన్వీనర్ సాంబశివ మాట్లాడుతూ పాత అమీన్ నగర్, న్యూ అమీన్‌నగర్‌లో వారం రోజుల పాటు సర్వే నిర్వహించామన్నారు. ఇందులో ఆయా కాలనీల్లో 113 మంది పేదలకు సొంత ఇల్లు లేదని గుర్తించామన్నారు. వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ ఇన్‌చార్జ్ అడ్మిన్ ఈశ్వర్ రెడ్డి, వీఆర్‌ఓ నాగమణికి వినతిపత్రం అందజేశారు.

శైలజనాథ్ చేరికపై హర్షం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు

ధర్మవరం: పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజనాథ్ వైఎస్సార్‌సీపీలో చేరడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు చౌడప్ప, అంజతాకృష్ణ, కుణుతూరు గోపాల్, గరుడంపల్లి నారాయణస్వామి, నాగార్జున పేర్కొన్నారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నివాసంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో దళితులకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు.

వైద్య శిబిరం

తనకల్లు: పెద్దపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. తద్వారా దోమలను నిర్మూలించవచ్చని తెలిపారు. అనంతరం గొవ్వళ్లపల్లిలో జ్వరాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మలేరియా అధికారులు లక్ష్మీనాయక్, రమణయ్య, ఎంపీహెచ్‌ఈఓ గఫూర్ పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ లోకేశ్వరరెడ్డి

ఎన్పీకుంట: పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ లోకేశ్వరరెడ్డి సూచించారు. పెడబల్లి, ఎదురుదోన, వెలిచలమల పంచాయతీల్లో శుక్రవారం కంది, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఆయా పంటల్లో చీడపీడల నివారణ, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న ఆర్టీఓ వీవీఎస్ శర్మ

కదిరి టౌన్: డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆర్టీఓ వీవీఎస్ శర్మ సూచించారు. శుక్రవారం రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా కిమ్స్ సవీరా ఆస్పత్రి(అనంతపురం) సౌజన్యంతో శుక్రవారం ఆర్టీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే చేసే పనిమీద దృష్టి పెట్టవచ్చన్నారు. డ్రైవర్లందరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అనంతరం కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు 150 మంది డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీఓ ఎన్ఎన్.కరుణాకర్‌రెడ్డి, ఆర్టీఓ శ్రీనివాసులు, ఎంవీఐ వరప్రసాద్, ఏఎంవీఐ రాజేష్, వైద్యులు టి.శ్రీనివాస్, సందీప్, మధు, సీఐ నిరంజన్‌రెడ్డి, వాల్మీకి పాఠశాల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఎన్పీకుంట: వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం సామాజిక తనిఖీ బృందం సభ్యులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని పాఠశాల కమిటీ సభ్యులు తెలిపారు. పాఠశాలలో 389 మంది విద్యార్థులకు 4 కుళాయిలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, భోజనాలు తినేందుకు డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాఠశాల పరిసరాలను, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లను పరిశీలించారు. వీటికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బాబ్జి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చెన్నేకొత్తపల్లి: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చెన్నేకొత్తపల్లి పోలీసులు విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ‘ట్రాఫిక్ నిబంధనలు’ అనే అంశంపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాస రచన పోటీలకు విశేష స్పందన లభించింది. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్‌ఐ సత్యనారాయణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ గోడౌన్ ప్రారంభం

నల్లమాడ: మండల కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య రూ.15 లక్షలతో నిర్మించిన వ్యవసాయ గోడౌన్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల వ్యవసాయ ఉత్పత్తిదారులు, పరస్పర సహాయ సహకార సమాఖ్య అనతికాలంలోనే రూ.7 కోట్ల మార్కెటింగ్ చేపట్టడం అభినందనీయమన్నారు. అందుబాటులోని సాంకేతికతతో రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కే.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, మైలే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’పై అవగాహన

పుట్టపర్తి అర్బన్: పెడపల్లిలో శుక్రవారం డాక్టర్ జ్యోత్స్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రజలకు తెలియజేశారు. అనంతరం పీహెచ్‌సీ వద్ద రోగులకు వైద్య చికిత్సలు అందించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నగేష్, ఆరోగ్య కార్యకర్త రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పరికరాల అందజేత



క్రీడా పరికరాలతో విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: ప్రశాంతి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడా పరికరాలు అందజేశారు. సొసైటీ కార్యదర్శి ప్రభాకరరెడ్డి, హెచ్‌ఎం జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడల్లో ప్రావీణ్యం సాధిస్తే ప్రత్యేక కోటాలో ఉద్యోగాలు సాధించే అవకాశాలుంటాయన్నారు.

దరఖాస్తు చేసుకోండి

బత్తలపల్లి: మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల(రేగాటిపల్లి)లో ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం దేవరకొండ మాధవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 15 నుంచి మార్చి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదివిన వారు అర్హులన్నారు. బీసీ, ఈ బీసీ, ఇతర విద్యార్థులు 11 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 12 ఏళ్లకు మించి వయస్సు ఉండరాదన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

‘స్టెమి’తో గుండెకు భరోసా

చెన్నేకొత్తపల్లి: స్టెమి కార్యక్రమంతో గుండెపోటు నుంచి బయటపడొచ్చని వైద్యులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్టెమి కార్యక్రమంపై ఆస్పత్రి వైద్యాధికారిణి డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ రాజశేఖరరెడ్డి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రూ.45 వేలు విలువ చేసే టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉందన్నారు. గుండెనొప్పి వచ్చినప్పుడు నిర్లక్ష్య చేయకుండా సమీపంలో ఆస్పత్రికి వెళితే ప్రాణపాయం నుంచి బయటపడవచ్చన్నారు. డాక్టర్లు మాధవి, రవి నాయక్, రమేష్, తేజ్‌దీప్ ఉన్నారు.